క్లుప్తంగా

జవహర్ నవోదయకు వేమవరం విద్యార్థి ఎంపిక



సీహెచ్ అనీష్ కుమార్

భట్టిప్రోలు: జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుచున్న విద్యార్థి సీహెచ్ అనీష్ కుమార్ ఎంపికయ్యాడు. అనీష్‌కుమార్‌ను ఎంఈవోలు పి.లాజర్, ఎస్.దేవరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

జవహర్ నవోదయకు కొల్లూరు విద్యార్థి

కొల్లూరు : కొల్లూరు ఫోర్‌ఫ్రంట్ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థి జవహర్ నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం ఆదివారం తెలిపారు. మండలంలోని పెదలంకకు చెందిన తోట రామకృష్ణ కుమారుడు తోట వెంకట నాగసాయి ఐదో తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో వెంకటనాగసాయి అర్హత సాధించాడు. వెంకట నాగసాయిని విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

బాపట్ల: రోటరీ క్లబ్ బాపట్ల వారి ఆధ్వర్యంలో విజయలక్ష్మీపురంలోని రోటరీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ అధ్యక్షులు డాక్టర్ ఆర్.వీర రాఘవయ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈసీజీ, ఈసీహెచ్‌ఓ పరీక్షలు ఉచితంగానిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్యం అందించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు సుకుమార్, సాయి వైద్య సేవలు అందించారు. రోటరీ క్లబ్ సభ్యులు మెడికల్ క్యాంపు చైర్మన్ తాళ్లూరి మల్లికార్జునరావు, కోశాధికారి వి. శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ఉపేంద్ర గుప్త, మొరిశెట్టి సుధీర్ కుమార్, బూర్ల రామ సుబ్బారావు, ఏలూరి హరిబాబు, జాగర్లమూడి లక్ష్మీ, కొత్త ప్రసాద్, టీవీ.సత్యనారాయణ, జిట్టా శ్రీనివాసరావు, జెవి కృష్ణారావు, టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న కుటుంబీకులు



భట్టిప్రోలులో ఈస్టర్ ప్రార్థనలలో పాల్గొన్న విశ్వాసులు



రేపల్లె ఐఆర్ఈఎఫ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న విశ్వాసులు

క్రీస్తు సందేశం.. మానవాళికి ముక్తిమార్గం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- ప్రార్థనల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు



బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి ఆశీర్వాదం చేస్తున్న సంఘ కాపరి రెవ.డీఎం. రాహుల్‌దేవ్

బాపట్ల: ఈస్టర్ పండుగ సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలో ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచే క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి స్థానిక సీబీజెడ్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సంఘ కాపరి రెవ.డిఎం.రాహుల్‌దేవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ ఐ.రాజేష్, ప్రేమ్‌చంద్, విజయకుమార్, జి.పుష్పలత, జె.క్రిస్టాఫర్ తదితరులు పాల్గొన్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.



ప్రార్థనలు నిర్వహిస్తున్న మేజరు బాబురావు

వేమూరు: మన ప్రభువు పునరుత్థానం కావడం జరిగిందని మేజరు బి బాబురావు అన్నారు. మండల కేంద్రంలోని రక్షణ సైన్యం చర్చిలో ఈస్టరు పండగ వేడుకలు ఆదివారం నిర్వహించారు. క్రైస్తవులకు ఈస్టరు పండగ అత్యంత పవిత్రమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. వీధుల్లో తిరుగుతూ ఏసుక్రీస్తు సువార్తను ప్రకటిస్తూ పాటలు పాడారు. సమాధుల వద్ద పునరుత్థాన ప్రార్థనలు చేశారు. వేకువ జామునే స్మశాన వాటికలలో తమ పూర్వీకుల సమాధుల వద్ద పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. తెల్లవారుజాము నుంచి చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ సందర్భంగా భట్టిప్రోలులోని సొవార్థిక లూథరన్ సంఘం-క్రీస్తు లూథరన్ ఆలయం, రైలుపేటలో నిర్వహించిన ప్రార్థనలలో గురుమండల అధ్యక్షులు రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ మాట్లాడుతూ పాప పరిహాల నుంచి మానవులను సంరక్షించేందుకు మృతి చెందిన ఏసు క్రీస్తు తిరిగి లోకానికి వచ్చాడన్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువధారి అయిన ఏసు క్రీస్తు తిరిగి పునరుత్థానం చెందిన రోజుగా ఈస్టర్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని చెప్పారు. స్థానిక బేతేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ కె.అబ్రహం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పునరుత్థాన పర్వదిన వేడుకలు

రేపల్లె రూరల్: ఈస్టర్ పర్వదిన వేడుకలను నియోజకవర్గంలోని పలు చర్చిల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్(ఐఆర్ఈఎఫ్)చర్చిలో నిర్వహించిన ఈస్టర్ పర్వదిన వేడుకల్లో బిషప్ డాక్టర్ ఇమ్మానియేలురెబ్బా, జాన్ రెబ్బాలు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. కరుణామయుడైన ఏసు పునరుత్థానం చేయబడిన రోజునే ఈస్టర్ పండుగగా జరుపుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ దేవునియందు విశ్వాసం ఉంచాలన్నారు. ప్రేమ, కరుణ, దయలు యేసు మార్గాలన్నారు. సాటి జీవులపట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశ మంతటి సహనం ఇవన్నీ జీసెస్ తన జీవితం ద్వారా మానవులకు ఇచ్చిన మహోన్నత సందేశమన్నారు. పాపుల పాపాలను తొలగించేందుకే అవనిపై అడుగుపెట్టి తన రక్తాన్ని చిందించి పాప ప్రక్షాళన చేశారన్నారు. కార్యక్రమంలో విశ్వాసులు పాల్గొన్నారు. ఏఈఎల్‌ఈ చర్చిలో పాస్టర్ అబ్రహం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పిట్టలవానిపాలెం: మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో దైవసేవకులు ఈస్టర్ ప్రాముఖ్యతను సంఘస్తులకు వివరించారు. క్రీస్తు పాపుల కోసం మరణించి తిరిగి మూడో రోజు పునరుత్థానం చెందడంతో ఆ రోజును ఈస్టర్‌గా క్రైస్తవులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున క్రైస్తవ సోదరులు తమ పూర్వీకుల సమాధుల వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల పరిధిలోని అల్లూరు శివారు సత్తలవారిపాలెం, అలకాపురం శివారు మండేవారిపాలెం, ఖాజీపాలెం శివారు గడ్డంవారిపాలెం, మండేవారిపాలెం, చందోలు శివారు దళితవాడ, కత్తివారిపాలెం, మంతెనవారిపాలెం శివారు దళితవాడ, పిట్టలవానిపాలెం శివారు దళితవాడ, జీఎస్ పాలెం శివారు దివాన్‌తోట తదితర గ్రామాలలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫలహారాలను ఆరగించారు. మండలంలోని భవనవారిపాలెం శివారు కొత్తరెడ్డిపాలెం, రెడ్డిపాలెం సెంటర్‌లో గల ప్రార్థనా మందిరాలలో ఈస్టర్ పండుగను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రార్థనా మందిరాలను నూతనంగా అలంకరించి విద్యుద్దీపాలు వెలగించారు. 40 రోజుల ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయని దైవసేవకులు ప్రకటించారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

కర్లపాలెం: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కల్వరి శిలువపై ఏసు ప్రభువు తన రక్తాన్ని చిందించి మరణించిన పిదప తిరిగి సమాధి నుంచి లేచిన రోజును ఈస్టర్ పండుగగా క్రైస్తవులు జరుపుకోవడం ఆనవాయితీ. పాస్టర్లు ప్రభువు చేసిన త్యాగాన్ని విశ్వాసకులకు వివరించారు. పండుగ సందర్భంగా ఆదివారం తెల్లవారు జామున క్రైస్తవులు తమ పూర్వికుల సమాదుల వద్ద క్యాండిల్స్ వెలింగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని యాజలి, బుద్ధాం, కర్లపాలెం, బిడారుదిబ్బ, చింతాయపాలెం, గణపవరం, కట్టావాద, పెదమార్పువారిపాలెం, మార్పు చెన్నాయ్‌వారిపాలెం, పేరలిపాడు, పేరలి, నర్రావారిపాలెం, నల్లమోతు వారిపాలెం గ్రామాలలోని క్రైస్తవ దేవాలయాలలో విశ్వాసకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

గ్రామ సచివాలయాల వద్ద పంపిణీకి ఏర్పాట్లు

వేమూరు: ఈ నెల 3 నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయరాదని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అందువల్ల వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడం లేదన్నారు. పింఛన్ లబ్ధిదారులు ఈ నెల 3న గ్రామ సచివాలయం వద్దకు ఆధార్ కార్డు తీసుకొని వెళ్లాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా తరచుగా సెలవులు రావడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండు రోజులు ఆలస్యం అయినట్లు చెప్పారు.

నేటి నుంచి వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార పర్వానికి తెరతీయనున్నట్లు కొల్లూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో మండలంలోని చిలుమూరు నుంచి వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.సోమవారం ఉదయం 9.40 గంటలకు చిలుమూరులోని ఉభయ రామలింగేశ్వర క్షేత్రంలో పూజలు, స్థానిక చర్చిలో ప్రార్థనల అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ముందుగా వైఎస్ఆర్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కూచిపూడిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 7 గంటలకు వేమూరు, భట్టిప్రోలు మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరుతారన్నారు.ఈ ర్యాలీ మండలంలోని కోటిపల్లి, దోనేపూడి, కొల్లూరు, ఈపూరు గ్రామాల మీదుగా చిలుమూరు చేరుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారానికి నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

వేమూరు: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సోమవారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతుందని అమర్తలూరు మండల పార్టీ అధ్యక్షుడు యలవర్తి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 6 గంటలకు పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మూల్పూరు గ్రామంలోని లూథరన్ చర్చిలో ప్రార్థన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామ మసీదులో నిర్వహించే ప్రార్థనల్లో పాల్గొంటారని చెప్పారు. కొల్లూరు మండలంలోని చిలుమూరు గ్రామంలోని ఉభయ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం 9 గంటలకు పూజలు నిర్వహించిన అనంతరం చిలుమూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. కూచిపూడి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ ద్వారా కదలి వెళ్లాలని పిలుపు నిచ్చారు.

'చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దు'

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- కూచిపూడిలో ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వర్గీయులకు పార్టీ కండువాలు కప్పుతున్న వరికూటి



భట్టిప్రోలు మండలంలో ఆత్మీయ సమావేశానికి పార్టీ శ్రేణులతో వెళుతున్న వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలను మోసం చేసిన చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఆదివారం భట్టిప్రోలు మండల కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ ఆధ్వర్యంలో అమృతలూరు మండలం కూచిపూడిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో భట్టిప్రోలు గ్రామ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. అశోక్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగాలు రాక, ఆర్థిక స్తోమత చాలక, పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దలేక చిరు వ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటూ బతుకులీడుస్తున్న ముస్లిం సోదరుల చీకటి జీవితాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దయతో వెలుగులు విరజిమ్మాయన్నారు. వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతో ముస్లిం సోదరులు వారి పిల్లల చదువుకు ఆర్థిక భారం అడ్డులేకపోవడంతో బాగా చదివించి బంగారు భవిష్యత్తును అందించారన్నారు. ఈ సందర్భంగా భట్టిప్రోలుకు చెందిన పలు టీడీపీ కుటుంబాలు అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ముస్లిం మత పెద్దలు, మైనార్టీ మండల కన్వీనర్ సయ్యద్ ఇస్మాయిల్, గ్రామ కన్వీనర్ మహ్మద్ జానీ, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని రానున్న ఎన్నికల్లో అశోక్‌బాబు అత్యధిక మెజార్టీతో గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సంక్షేమ సారథికి పట్టం కడదాం

భట్టిప్రోలు: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కోరారు. ఆదివారం మండలంలోని పల్లెకోన, రాచూరు, ఆళ్లమూడి గ్రామాలలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబుకు ఆయా గ్రామ వాసులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని పార్టీలు కలసి వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల మద్దతు ఉన్న సీఎం జగన్ మళ్లీ గద్దెనెక్కడం ఖాయమన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీకి అవకాశం కల్పించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొల్లెద్దు ప్రతాప్, జయవరపు రాధాకృష్ణమూర్తి, పెద్దిశెట్టి రాంబాబు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు శేరు శ్రీనివాసరావు, ఆళ్లమూడి వెంకయ్య, చిల్కా రత్నబాబు, జస్వంత్ రాజ్, రెబ్బా మున్ని, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, పంతగాని నాంచారయ్య, బాల సుబ్రహ్మణ్యం (బాలు), యేపూరి నాగు, కనపర్తి శరత్‌బాబు, కనపర్తి ప్రశాంత్ రాజు, తిరువీధుల బాలాజీ, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి తెలిపారు. కర్లపాలెం గ్రామదేవత పెద్దింటమ్మ కల్యాణ మండపంలో ఆదివారం రెడ్డి సేవామిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో విజయవాడ తనూజ వైద్యశాల డాక్టర్లు ఎస్.మహీదర్‌రెడ్డి, బి.తనూజ 120 మందికి నరాలకు సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి, నాయకులు మోదుగుల బసవపున్నారెడ్డి, గాదె మధుసూదనరెడ్డి, కల్లం హరనాధరెడ్డి, పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీనివాసరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి, చీరాల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

బండ్లమ్మ వారి సన్నిధిలో హైకోర్టు జ్యుడీషియల్ డైరెక్టర్



శర్మ దంపతులను సత్కరిస్తున్న మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈవో నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జ్యుడీషియల్ డైరెక్టర్ హరిహరనాథ శర్మ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత బండ్లమ్మ దేవాలయానికి చేరుకుని ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండ్లమ్మ దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తిలు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం హరిహరనాథ శర్మ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

బండ్లమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, బుద్దా వెంకటలక్ష్మీ, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

బడుగులను అవహేళన చేయటం సిగ్గు చేటు

వైఎస్సార్ సీపీ ఎస్సీ ఎమ్మెల్యే అభ్యర్థిపై చంద్రబాబు విమర్శకు నిరసన



ఆళ్లమూడిలో నోటికి చేతులు అడ్డం పెట్టుకొని నిరసన

భట్టిప్రోలు: బడుగు, బలహీన వర్గాల వారిని రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉంచాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూస్తుండగా చంద్రబాబు అవహేళన చేయడం సిగ్గు చేటని ఆదివారం రాత్రి భట్టిప్రోలు మండలం ఆళ్లమూడిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పలువురు నోటికి చేతిని అడ్డం పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. టిప్పర్ డ్రైవర్, ఉపాధి హామీ పథకం కూలీకి ఎమ్మెల్యే సీటు ఇచ్చి పేదల బతుకుల్లో వెలుగులు నింపాలని జగన్ చూస్తున్నారని తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారిని ఎమ్మెల్యేలుగా చేయాలని చూస్తుంటే వారిని అవహేళన చేస్తున్న చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, ఎస్.రమేష్, ఎన్. నాగరాజు, జె.సాల్మన్, బి.రవిచంద్ర, జి.బాజీ, బి.సన్ని, ఎం. నాగేంద్ర, ఎన్. సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.